పంటలకు ధూళి దెబ్బ

ఆ ప్రాంతంలో పండేది అరకొర పంటలు.. వాటిలో కూడా కొన్ని క్వారీల నుంచి వెలువడే ధూళి కారణంగా పంటలు పండకపోవడంతో పాటు భూములు నిస్సారంగా మారుతున్నాయి. వర్షాలు కురిసినా దుమ్ము పొరతో భూములు అదును కావడం లేదు. అలాగే భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని, ఏటేటా దిగుబడి దారుణంగా పడిపోతోందని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అన్నదాతకు శాపంగా మారుతోంది.

- క్వారీల నుంచి వెలువడుతున్న డస్ట్
- పంటలను కమ్మేస్తున్న ఖైనం
- సారం కోల్పోతున్న భూములు
- ఇంకిపోతున్న భూగర్భ జలాలు
- వర్షా కాలంలో పదునెక్కని పొలాలు
- దిగుబడులు కోల్పోతున్నామంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


క్వారీ నుంచి వెలువడుతున్న డస్ట్

ఆలూరు: నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో క్వారీలు రైతులకు శాపంగా మారాయి. కొండ రాళ్లను కంకరగా మార్చే క్రమంలో వెలువడే డస్ట్ కారణంగా సమీపంలో వ్యవసాయ భూములు నిస్సారంగా మారుతున్నాయి. అలాగే వేసిన పంటలపై ధూళి కమ్మేస్తుండటంతో దిగుబడి పడిపోతోంది. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కనిపించిన అధికారులకు వివరించినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని వాపోతున్నారు.

కనికరమేదీ..

నియోజకవర్గంలో 12 క్వారీలు ఉన్నాయి. కరిడిగుడ్డం,అగ్రహారం,నగరూరు, హత్తిబెళగళ్, హుళేబీడు, చిన్నహ్యాట, కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ గ్రామాల్లోని క్వారీల కారణంగా తాము ఇబ్బందులకు గురువుతన్నామని రైతులు వాపోతున్నారు. ఆయా క్వారీలు వెదజల్లే డస్ట్ తమపంట పొల్లాల్లోకి చేరి పంటల సాగుకు ఇబ్బందిగా మారిందని పలు మార్లు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మౌఖింగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. క్వారీల యజమానులకు అధికారులు అండదండలు ఉండటం వల్లే వారు ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేయడం, రాళ్లను 20 ఎం.ఎం. చిప్స్‌గా మార్చడం, టిప్పర్ల ద్వారా తరలించడం వాటి కారణంగా వెలువడే ధూళి కారణంగా ఆ ప్రాంతమంతా నిండిపోతుందని, దీంతో తమ పొలాల్లో పంటలు సాగు చేసినా దిగుబడి రావడంలేదని, భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయినా.. పంటల సాగు..

ప్రస్తుతం వందలాది ఎకరాల్లో వేరుశనగ, పత్తి, పొద్దుతిరుగుడు, మిర్చి, కంది తదితర పంటలను చేస్తున్నారు. ఖరీఫ్‌లో భాగంగా ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి,హాలహర్వి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో 45 వేల ఎకరాల్లో పంటలను సాగుచేయాల్సి ఉంది. సరైన వర్షం పాతం నమోదు కాకపోవడంతో 35వేల ఎకరాలకు మించి సాగు కాలేదు. ఇందులో క్వారీల సమీపంలోనున్న పొలాల్లో భూగర్భ జలాలు ఇంకిపోవడంతో సాగు కష్టతరంగా మారింది.

అధికారులు పట్టించుకోవడం లేదు



మాకున్న ఐదు ఎకరాల్లో పత్తి పంటను వర్షాధారం కింద సాగు చేశాం.తమ పొలం సమీపంలో ఉన్న పవన్ క్వారీ నుంచి దుమ్ము గాలికి వచ్చి తమపంట పొలాల్లో పొరలాగా నిలిచిపోతోంది. దీంతో తమ పొలాలు నిస్సారంగా మారుతున్నాయి. అలాగే పంటపై దుమ్ము చేరడంతో ఎదుగదల లోపించి దిగుబడి సక్రమంగా రావడం లేదు. సమస్యను చాలా మంది అధికారులకు వివరించినా ఎవ్వరూ పట్టించుకోవడంలేదు.

– ఎల్లమ్మ కరిడిగుడ్డం గ్రామ మహిళా రైతు

వర్షాలకు పొలాలు పదును కావడం లేదు



క్వారీ సమీపంలో నాకు పొలం ఉంది. క్వారీ నుంచి రోజూ డస్ట్ వస్తుంది. ప్రస్తుతం డస్ట్ పొలంలో గాలికి వచ్చి చేరుతుంది. ఖరీఫ్ కాలంలో భారీ వర్షం కురిసినా పదును కావడం లేదు. క్వారీల యజమానుల నుంచి తమకు నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం పొలం సమీపం నుంచి రోజుకు అనేక లారీలు కంకర తోలుతున్నాయి. వాటి నుంచి దుమ్ము ఇంకా ఎక్కువగా వస్తోంది.

– వీరయ్య ఆలూరు గ్రామం, రైతు

రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు

క్వారీల నుంచి రైతుల పొలాల్లోకి డస్ట్ వస్తుందని ఫిర్యాదులు అందితే సంబంధిత యజమానులపై చర్యలు తీసుకుంటాం. వివిధ గ్రామాల వీఆర్వోలకు పొల్యూషన్‌పై ప్రత్యేకంగా నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చాం.

– విజయ్‌కుమార్
ఇన్‌చార్జ్ తహసీల్దార్, ఆలూరు

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునివ్వండి


విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

తుగ్గలి : పాఠశాల అభివృద్ధి పూర్వ విద్యార్థులు తోడ్పాటునివ్వాలని హెచ్ఎం మేఖేల్ కోరారు. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గణితం టీచర్ శివశంకరరెడ్డి సొంతంగా రూ.30వేలతో ఏర్పాటు చేయించిన ఫుట్‌బాల్ గోల్‌పోస్టును పీఎంసీ చైర్మన్ నాగరాజుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తన తండ్రి చంద్రశేఖరరెడ్డి స్మారకార్థం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా పత్తికొండ సెయింట్ జోసెఫ్ జట్టు, పెండేకల్లు జంక్షన్ జెడ్పీహెచ్ఎస్ ఏ జట్టు, ఏనుగుమర్రి జెడ్పీహెచ్ఎస్ జట్టు, పెండేకల్లు జంక్షన్ జెడ్పీహెచ్ఎస్–బి జట్టు నిలిచాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ పాండురంగరాజుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నాణ్యత పరిశీలన


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: మండల కేంద్రంలో ఇటీవల వేసిన సీసీ రోడ్లను పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్లు వేయకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యత తప్పని సరిగా పాటించాలని చెప్పారు. కాల పరిమితి ముగిసేవరకు రోడ్లు పాడవకుండా జాగ్రత్తలు పాటించాల్సిన బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌పై ఉంటుందన్నారు. వీరితో పాటు కార్యదర్శి శ్రీహరి ఉన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం తలెత్తనీయొద్దు

తుగ్గలి : వేసవిలో నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

ఆలూరు: వ్యవసాయ కూలీలలకు ఉపాధి హామీ పథకం పనులను కల్పించి కూలీల సంఖ్య పెంచేందుకు ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఏపీడీ మల్లేశ్వరి ఆదేశించారు. స్థానిక సీఎల్ఆర్ సమావేశం కార్యాలయంలో గురువారం ఆదోని, ఆలూరు క్లస్టర్ పరిధిలో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, టీఏ, డీటీపీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పనులు కావాలన్న వారందికీ పనులు కల్పించడమేకాకుండా పని మొత్తం వివరాలు, నేరుగా చేసిన పనులకు సంబంధించిన నగదును వారి ఖాతాల్లోకి చేరేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో యశోధర్ రావు, నరసింహులు, కిశోర్‌కుమార్, సురేష్ , ఏపీడీ లోకేష్ పాల్గొన్నారు.

గద్దెరాళ్లలో వైద్యశిబిరం

ఆలూరు: దేవనకొండ మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో జరుగుతున్న మారెమ్మ దేవర సందర్భంగా డాక్టర్ రేష్మీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు వంద మందికి వివిధ జబ్బులకు సంబంధించిన మాత్రలు,ఓఆర్ఎస్ తదితర వాటిని అందజేసినట్లు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ హనుమంతమ్మ, ఉమాబాయ్ తెలిపారు. శుక్రవారం వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

మద్దికెర: మండలంలో ఇల్లులేని అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురువారం స్థానిక గుంతకల్లు రోడ్‌లోనున్న పెట్రోల్ బంకు ఎదురుగానున్న స్థలంలో కొలతలు వేసి రాళ్లు పాతించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఇళ్లు లేని వారు ఎవరు వచ్చినా ఇంటి పట్టా మంజూరు చేస్తామన్నారు. గతంలో కొందరు ఇంటి పట్టాలు పొందినట్లు పట్టాలు తీసుకొస్తున్నారని అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వో రంగస్వామి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామంలో సర్పంచ్ మునెమ్మ ఆధ్వర్యంలో నీటి ఎద్దటి నివారణ చర్యలు చేపట్టారు. గురువారం గ్రామంలో ఎస్సీ కాలనీలో వారం రోజులుగా పైపులైన్ మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మర్మతులు చేపట్టారు. పాత పైపులైన్ తొలగించి గ్రామంలోని ఓఎస్‌హెచ్ఆర్ ట్యాంకు నుంచి నూతన పైపులైన్ వేస్తున్నారు.

కాన్పుల మధ్య వ్యవధి ఉండాలి

చిప్పగిరి: కాన్పు,కాన్పుకు మధ్య కనీసం రెండు సంవత్సరాల వ్యవధి ఉండేలా బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ జామిల్ అహమ్మద్ ఆశా కర్యకర్తలకు సూచించారు. ఆశా డే సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వవైద్యశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ కాన్పుల మధ్య వ్యత్యాసం ఉండకపోతే శిశువులు అనారోగ్యంగా, బలహీనంగా ఉండే అవకాశంతో పాటు తల్లులకు కూడా వివిధ రకాల సమస్యలు వచ్చే ప్రమాదముందని చెప్పారు. అలాగే ఈ నెల 20వ తేదీన నేషనల్ ఓరల్ హెల్త్ డే సందర్భంగా నేటి నుంచే నోటి క్యాన్సర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. నోటి క్యాన్సర్ రాకుండా ఉండాలంటే పొగాకు, మద్యపానానికి దూరంగా ఉండాలని, నోటిలో దీర్ఘకాలిక వ్యాధులుంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సీహెచ్ఓ వెంఖటేశ్వర్లు, అశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డ్వామా పీడీ రాక

ఆలూరు: సీఎల్ఆర్‌సీ క్లస్టర్ పరిధిలోనున్న డీటీపీ, టీఏ, ఈసీల సమావేశంలో పాల్గొనేందుకు జిల్లా డ్వామా పీడీ అమర్నానాథ్‌రెడ్డి శుక్రవారం ఆలూరు రానున్నారని ఏపీడీ మల్లేశ్వరి గురువారం తెలిపారు.సమావేశానికి ఏపీఓ, టీఏ, ఈసీ, ఆదోని ఏపీడీ, కార్యాలయ సిబ్బంది కచ్చితంగా హాజరు కావాలని ఏపీడీ సూచించారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పత్తికొండ రూరల్: మండలంలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలో గురువారం రాత్రి ప్రమాదవశాత్తు ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని దేవనబండకు చెందిన కోటి, అటికెలగుండు గ్రామానికి చెందిన రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

అమరజీవి త్యాగ ఫలమే ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌డీఓ మోహన్‌దాసు


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

పత్తికొండటౌన్: ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలని ఆర్‌డీఓ మోహన్‌దాసు అన్నారు. గురువారం పత్తికొండలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆర్‌డీఓ పూలమాల వేసి, నివాళులర్పించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నారాయణదాసు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నెట్టేకల్లు, రాజులమందగిరి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది సువర్ణలత, దస్తగిరి పాల్గొన్నారు. శాఖాగ్రంథాలయంలో శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి రాంకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మిగనూరుటౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలమే ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు.గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవి కళ్యాణ మండపంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నందవరం: ఆంధ్ర రాష్ట్ర ఆవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని డిప్యూటీ తహసీల్దార్ రఘువీర అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. రెవెన్యూ అధికారులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ఐ జెరిమియా, మండల సర్వేయర్ అబ్బుర్‌బాషా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు కిశోర్‌కుమార్, జనార్ధన్‌స్వామి, వీఆర్వోలు,సిబ్బంది పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం ధన్‌రాజ్ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతిని గురువారం జరుపుకున్నారు. ముందుగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారిణి కవితాబాయ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు, ఖాదర్‌బాషా, ఎల్లయ్య, వాసు పాల్గొన్నారు.

కృష్ణగిరి: తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్ర సాధనలో అమరుడైన పొట్టి శ్రీరాములు ఆశయాలు, ఆదర్శాలు అనుసరణీయమని తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రీసర్వే డీటీ రామలక్ష్మి, ఆర్ఐ మస్తాన్, సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు పార్థసారథి,విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి
- ఏడుగురు వలంటీర్లకు మెమోలు జారీ


ఎల్లార్తి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

హొళగుంద: ఆయుష్మాన్ భారత్, ఎస్‌డీజీ సర్వేలు పకడ్బందీగా నిర్వహించి లక్ష్యాన్ని చేరుకోవాలని, అలాగే సంక్షేమ పథకాలను ప్రజల దరికి చేర్చేందుకు కృషి చేయాలని డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచించారు. గురువారం ఆయన ఎంపీడీఓ దాసానాయక్‌తో కలిసి నెరణికి, ఎల్లార్తి, చిన్నహ్యాటతో పాటు హొళగుందలోని నాలుగు సచివాలయాలను తనిఖీ చేశారు. అలాగే స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏడుగురు వలంటీర్లకు మెమోలు..

ప్రజలకు సేవలందించడం, ప్రభుత్వ పథకాలపై సర్వే, ఇతర విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎల్లార్తి, చిన్నహ్యాటకు చెందిన ఏడుగురు వలంటీర్లకు ఎంపీడీఓ దాసానాయక్ మెమోలు జారీ చేశారు. గురువారం ఆయన డీఎల్‌డీఓతో కలిసి చేపట్టిన సచివాలయాల తనిఖీలో వలంటీర్ల పనితీరు సరిగా లేకపోవడాన్ని గమనించారు. కాగా ఇప్పటికే గజ్జహళ్లి, వందవాగిలికి చెందిన 15 మంది వలంటీర్లకు మెమోలు జారీ సంగతి తెలిసిందే.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

తుగ్గలి: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక అనసూయ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి సమయానికి ముందే విద్యార్థులు చేరుకున్నారు. తెలుగు, సంస్కృత పరీక్షకు మొత్తం 118 మంది విద్యార్థులకు గాను 110 మంది హాజరయ్యారని చీఫ్ అధికారిణి కిరణ్మయి తెలిపారు.

మద్దికెర: స్థానిక ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో జరుగుతున్న ద్వితీయ ఇంటర్ పరీక్షలకు సంబంధించి 246 మంది విద్యారులకు గాను 15 మంది విద్యార్థులు గైరాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సవిత, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ అంకమరావు గురువారం తెలిపారు.

వెల్దుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురవారం ఇంటర్మీడియెట్ సెకండియర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ కాలేజీల్లో 199 మంది పరీక్షలు వ్రాయాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ జ్ఞానేశ్వరి, డీఓ చంద్రకాంత్ తెలిపారు.

ఆస్పరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. మొత్తం 179 మంది విద్యార్థులకు గాను 171 మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహులు తెలిపారు.

మాస్‌కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు..

కృష్ణగిరి: ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పిడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డీఈసీ మెంబర్లు గోవిందురాజులు, లాలప్ప హెచ్చరించారు. గురువారం వారు స్థానిక మోడల్ స్కూల్‌లో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఏలాంటి ఆసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 193 మంది విద్యార్థులుహాజరైనట్లు సీఎస్ విశ్వేశ్వరయ్య, డీపీ చౌడప్ప తెలిపారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు


పత్తికొండ కస్తూర్బాలో విద్యార్థినితో మాట్లాడుతున్న పీఓ వేణుగోపాల్

పత్తికొండటౌన్: పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు చేపట్టినట్లు సమగ్రశిక్షా పథకం జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ తెలిపారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా విద్యాలయం, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను బాలికాశిశు అభివృద్ధి అధికారిణి సునీత, ఏఎల్ఎస్ఓ శ్రీనివాసులతో కలిసి తనిఖీ చేశారు. పీఓ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి 22,791మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 58రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారని చెప్పారు.

రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మూల బృందావనం

మంత్రాలయం రూరల్ : శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు దేశం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మఠం అధికారులు చర్యలు చేపట్టారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరా ప్రాంతాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఊరేగించారు.

22 నుంచి హేమారెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచనం

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ప్రతి రోజూ రాత్రి హేమారెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ జంగమర హోసల్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య, పాల్తూరు చెన్నవీర శివాచార్య, రొడకుంద శివయోగి శివాచార్య మహాస్వాములు హాజరవుతారని చెప్పారు.ముగింపు రోజు గ్రామంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ముత్తైదువులకు సామూహిక ఒడిబియ్యం తదితర కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

'గద్దెరాళ్ల'హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ సొమ్ము లెక్కిస్తున్న దృశ్యం

ఆలూరు: దేవనకొండ మండలంలోని గద్దెరాళ్ల గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మారెమ్మ దేవర సందర్భంగా లభించిన కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని గురువారం ఆలయ ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ ఏడాది హుండీ ఆదాయం రూ.14,66,667 లభించిందని ఈఓ తెలిపారు. గత ఏడాది కుంటే రూ.3,17,727లు అదనంగా సమకూరిందన్నారు.

ఆర్థిక సాయం

చిప్పగిరి: మండలంలోని గుమ్మనూరు గ్రామానికి చేందిన నిరుపేద కుటుంబానికి చెందిన హరిజన వడ్రప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ రూ.10 వేలు అంత్యక్రియల నిమిత్తం అందజేశారు. కాగా అంతకుముందు వైద్య ఖర్చుల కోసం రూ.20 వేలు అందించాడని, అయినా కోలుకోలేకపోయాడని స్థానికులు పేర్కొన్నారు.

నవధాన్యాలను సాగుచేద్దాం


ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న ఏడీఏ విజయమోహన్

పత్తికొండ రూరల్ : నవధాన్యాలను సాగుచేసి భూమాతను సంరక్షించుకుందామని ఏడీఏ విజయ మోహన్ సూచించారు. గురువారం మండల ంలోని దేవనబండ గ్రామంలో సర్పంచు ప్రవీణ ఆధ్వర్యంలో విద్యార్థులు, రైతులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత నివ్వాలని, తద్వారా భూసారం పెరిగి భూమాతను సంరక్షించుకోవడం సాధ్యమవతుందని చెప్పారు. అంతేకాకుండా ఆరోగ్యకరమైన జీవనానికి ఇంటి పెరట్లో కిచెన్ గార్డెన్ తప్పకుండా వేసుకోవాలని కోరారు. ఏఓ వెంకట్రాముడు, డీపీఎం చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నాయకుడు గాంధిరెడ్డి, వీహెచ్ఏ వాణి పాల్గొన్నారు.

వెల్దుర్తి: నవధాన్యాల సాగుతో ఇటు రైతులకు అటు పుడమికి, ప్రకృతికి మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయశాఖ సబ్ డివిజన్ అధికారి షేక్ మాబువలి తెలిపారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని కలుగొట్ల గ్రామంలో నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చేద్దాం, ప్రజల ఆరోగ్యం కాపాడుదాం...నవధాన్యాల సాగు, నేలతల్లికి మేలు, రసాయనాలు వద్దు సేంద్రీయం ముద్దు తదితర ప్లకార్డులు చేతబట్టిన విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మెయిన్ కూడలిలో మానవ హారం ఏర్పాటు చేసి నవధాన్యాల సాగు విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. సిబ్బంది నాగేశ్వరరెడ్డి, పరమేష్, రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కోగిలతోటలో నేడు మేటి కుంభోత్సవం

హొళగుంద: మండలంలోని కోగిలతోట గ్రామంలో శుక్రవారం సుంకలమ్మ, మారెమ్మ దేవీల మేటి కుంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం గంగ పూజ, అమ్మవార్ల ముఖాల దర్శన కార్యక్రమం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 3.35 గంటలకు మేటి కుంభోత్సవాల ఊరేగింపుతో పాటు ఆలయాలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలు జరుగుతాయని జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, సర్పంచ్ యాట గురుపాదమ్మ, నాయకులు శేషప్ప,నాగప్ప,వెంకటేష్ తెలిపారు.

మంటలు చెలరేగి పత్తి దగ్ధం


కాలి బూడిదైన పత్తి

కోసిగి: సజ్జలగుడ్డం గ్రామానికి గుండమ్మ గారి మల్లయ్య ఇంట్లో ప్రమాదశాత్తు మంటలు చెలరేగి భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గురువారం ఉదయం మల్లయ్యగారి కుమారుడు ఇంట్లో దేవుడి గుడి వద్ద దీపం వెలిగించి శ్రీశైలం దర్శనార్థం వెళ్లాడు. కొద్ది సేపటి భార్య పొలం పనులకు వెళ్లగా ఆయన ఇంటికి తాళం వేసి పని నిమిత్తం కోసిగి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటిలో నుంచి పొగలు వ్యాప్తి చెందాయి. చుట్టు ప్రక్కల ప్రజల చూసి ఇంటికి వేసిన తాళం పగల కొట్టి మంటలార్పే ప్రయత్నం చేశారు. పాత ఇళ్లు కావడంతో ఇంటి మిద్దెకు కూడ మంటలు వ్యాప్తి చెందాయి. మిద్దెకు నీళ్లుపోసి పైకప్పును కూల్చాల్సి వచ్చింది. ఇంట్లో ఉన్న 16 క్వింటాళ్ల పత్తి, పొలం పత్రాలు, ఎల్ఐసీ బాండ్, రెండు తులాల బంగారు, వంటసామగ్రి కాలి బూడిదైంది. మార్కెట్‌లో పత్తికి రేటు తక్కువ ఉందని ఇంట్లోనే నిల్వ చేసి ఉంచాడు. అంతలోనే రూ.2లక్షలు విలువ పత్తి కాలిపోయింది. ఇంట్లో దేవుడి గుడివద్ద అంటించిన దీపమా లేక విద్యుత్ షాట్ షర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగిందా అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పాముకాటుతో బాలుడు మృతి


మృతిచెందిన బాలుడు శివరాజ్

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఉరుకుందప్ప కుమారుడు శివరాజ్(07) గురువారం పాముకాటుకు గురై మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాత్రి ఇంటి వద్ద ఆడుతుండగా పాము కాటు వేసిందని, వెంటనే నాటువైద్యుడి వద్దకు వెళ్లామన్నారు. అనంతరం ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు చికిత్సలు చేస్తుండగా మృతి చెందాడు.